మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

- మహిళలు అబలలు కాదు సబలలు
- మారథాన్ కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలోని మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ హెచ్చరించారు. సమాజంలో ఉండే లింగ వివక్షకు శాశ్వతంగా ముగింపు పలికి, పురుషులతో సమానంగా సమాజంలో ముందుకు వెళ్లాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మహిళలంటే అబలలు కాదని, సబలలని నిరూపించుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పని ప్రదేశాల్లో మహిళలపై జరుగు లైంగిక వేధింపుల నివారణపై అవగాహన ర్యాలీ (మారథాన్) కార్యక్రమం మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మారథాన్ ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. మహిళా డిగ్రీ కళాశాల వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ సూర్యమహల్ జంక్షన్ వరకు కొనసాగింది. అనంతరం మానవహారం ఏర్పాటుచేసి మహిళల లైంగిక వేధింపుల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై జరుగు లైంగిక వేధింపుల నివారణపై గత నెల 26 నుండి ఈ నెల 10వ తేది వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం తరపున జిల్లా అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో సమావేశం కూడా ఏర్పాటుచేసుకున్నామని తెలిపారు. మహిళలు పనిచేస్తున్న ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైతే తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిచో పై అధికారులను సంప్రదించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. లైంగిక వేధింపులకు ఎవరైనా పాల్పడితే కలెక్టర్, జిల్లా యస్.పి, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి లేదా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులను సంప్రదించవచ్చని కలెక్టర్ వివరించారు. జిల్లాలో యస్.పి, డిఎంహెచ్ఓ, మహిళ, శిశు సంక్షేమాధికారులు మహిళలు కావడం మన అదృష్టమని, బాధితులు ఎవరైనా ఉంటే వారికి వివరంగా తెలియజేయవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. మహిళల లైంగిక వేధింపుల నివారణపై రూపొందించిన గోడ పత్రికను ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ మారథాన్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డా. డి.వి.విద్యాసాగర్, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖాధికారి కె.అనంతలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి.మీనాక్షి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట రామన్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసంఘం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర-సోంపేట : 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ మండలం మాకన్నపురం గ్రామంలో 125 మీటర్ల సీసీ రోడ్డును బుధవారం నిర్మించారు. సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పించి రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొరికాన ఆనందరావు, మాజీ ఎంపిటిసి జోగారావు, యాదవరావు, చంద్రయ్య, లోకనాథం, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

పతాక దినోత్సవానికి విరివిగా విరాళాలు ఇవ్వండి

పతాక నిధికి విరాళం అందించిన కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: సాయుధ దళాల పతాక నిధికి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ విరాళాలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయుధ దళాల పతాక దినోత్సవం 2022లో భాగంగా పతాక నిధికి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. పతాక నిధి ఫ్లాగ్ ను జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజా జిల్లా కలెక్టర్ కు అందించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత సైనిక దళాలు, దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల దేశం గర్విస్తుందని అన్నారు. పతాక నిధికి విరివిగా విరాళాలు ప్రతిఒక్కరు అందించాలని కలెక్టరు కోరారు. మీరు అందించే విరాళాలను, జిల్లా సైనిక సంక్షేమ అధికారి, శ్రీకాకుళం వారి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతా : 62064304822, (IFSC Code: SBIN) 0020784లోగాని డైరెక్టర్, సైనిక వెల్ఫేర్, విజయవాడ పేరున చెక్కు లేదా డ్రాఫ్ట్ తీసి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, శ్రీకాకుళం వారికి సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ.ఎ ఫెడరేషన్ గ్రూప్ కెప్టెన్, వైర్మెన్ ఈశ్వరరావు, డి.ఈ.ఎఫ్ ఫెడరేషన్, ప్రెసిడెంట్ పూర్ణచంద్ర రావు, ఎయిర్ ఫోర్స్, పెటి ఆఫీసర్ రమణమూర్తి ఇండియన్ నేవీ, హవల్దర్ మురళీధర్‌రావు ఇండియన్ ఆర్మీ, సూపరింటెండెంట్ ఈశ్వరరావు, ఎన్.సి.సి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో గాయత్రి విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: కాకినాడ కేంద్రంగా 'కాకినాడ జూడో అసోసియేషన్ 'ఈ నెల 3 నుంచి 5 వరకు మూడురోజులు పాటు నిర్వహించిన "రాష్ట్ర స్థాయి జూనియర్ జూడో ఛాంపియన్ షిప్ 'పోటీలలో పాల్గొని తమ కళాశాల విద్యార్థి కొల నగేష్ 'బ్రౌంజ్ మెడల్ 'సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. పులఖండం శ్రీనివాసరావు ఒక ప్రకటన లో తెలిపారు. కళాశాలలో చదువుతో పాటు ఆరోగ్యం, ఉపాధికి ప్రయోజనకరమైన క్రీడాలను ప్రోత్సాహపరుస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విజేత నగేష్‌ను విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు అభినందించారు. ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం సత్కరించారు.

భగవద్గీతలో సాయి ప్రసీద, కిర్మయిలకు స్వర్ణం

విశాలాంధ్ర-కవిటి: ఈనెల 4వ తేదీన మైసూర్‌లో గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆశ్రమంలో గణపతి సచ్చిదానంద స్వామిజీ 80వ జన్మదినం, గీత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కవిటి మండలం కపాసుకుద్ది గ్రామం నుండి పండి సాయి ప్రసీద, బెండాళం కిరణ్మయి పాల్గొని చక్కని ప్రతిభ కనపరిచారు. ఈ మేరకు సాయి ప్రసీద, కిరణ్మయిలకు గణపతి సచ్చిదానంద స్వామిజీ చేతులమీదుగా బంగారు పతకంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ పోటీలలో అమెరికా, యూరప్, దుబాయ్ తదితర దేశాల నుండి పాల్గొన్నారు. భగవద్గీతలో చక్కని ప్రతిభ కనబరిచి బంగారు పథకాన్ని సొంతం చేసుకున్న సాయి ప్రసీద, కిరణ్ మయిలకు పిఏసిఎస్ మాజీ డైరెక్టర్ పులకల శ్రీరాములుతో పాటు గ్రామస్తులు అభినందించారు.

విజిలెన్స్ అధికారిగా సురేష్ బాబు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం: శ్రీకాకుళం రీజినల్ విజిలెన్సు అండ్ ఎన్ఫోర్సుమెంట్ అధికారిగా ఏ.సురేష్‌బాబు, ఎస్పీ, బాధ్యతలను స్వీకరించారు. గుంటూరు అవినీతి నిరోధక శాఖలో అదనపు ఎస్పీగా పనిచేస్తూ పదోన్నతిపై రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారిగా బదిలీ కావటంతో బుధవారం బాధ్యతలు స్వీకరించి సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజిలెన్సు డిఎస్పీ కిరణ్‌కుమార్, డిఈ సత్యనారాయణ, ఏఈ సురేశ్‌కుమార్, ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, సింహాచలం అధికారికి స్వాగతం పలికారు.

21 ద్విచక్రవాహనాలను వేలం వేసిన ఎక్సైజ్ అధికారులు

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 21ద్విచక్ర వాహనాలను వేలం వేశారు. అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ ఎస్ఈబి, కె.వి.గోపాల్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలో ఆసక్తి వున్న వ్యక్తులు పాల్గొని, వాహనాలను దక్కించుకున్నారు. 21ద్విచక్ర వాహనాల ధర రూ.2,23,000 ఎక్సైజ్ శాఖ నిర్ణయించగా, వేలం పాటలో ఎక్సైజ్ శాఖకు రూ.3,87,394 ఆదాయం వచ్చింది. సుమారు రూ.1,64,394 ఆదాయం అదనంగా వచ్చింది. ఈ కార్యక్రమంలో సిఐ, ఎస్.దొర, ఎస్ఐ, జె.సంధ్యారాణి, కానిస్టేబుల్స్, ధర్మరాజు, ఎస్వి.రమణ ఉమాపతి, హైమావతి, రాజేష్, రమేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో మురికి కాల్వ నిర్మాణం పనులు పరిశీలన

విశాలాంధ్ర-నరసన్నపేట : పట్టణంలోని బజారు వీధి నుండి శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయం వరకూ నిర్మాణం అవుతున్న మురికి కాలువ నిర్మాణాన్ని అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపిటిసి, వైశ్యరాజు కేశవరాజు మాట్లాడుతూ బజారు వీధిలో వర్షం పడితే నీరు రహదారిపైనే కొన్ని రోజుల పాటు నిలిచిపోయిండేదని, ఆ వర్షం నీటిని పట్టణానికి దూరంగా పంపించేందుకు మురికి కాలువ నిర్మాణం సుమారు రూ.30లక్షలతో చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్, ఉదయ్ భాస్కర్, సచివాలయం అసిస్టెంట్ ఇంజనీర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద ఎస్‌టియు ధర్నా

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఉద్యోగుల పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఎస్‌టీయూ (రాష్ట్రోపాధ్యాయ సంఘం) జిల్లా అధ్యక్షులు జి మధుసూదనరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ పి రమణ, రాష్ట్ర కౌన్సిలర్ చింతల రామారావు లు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యల పట్ల ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త ధర్నాలో భాగంగా ఎస్‌టియు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి విద్యామంత్రి ఉన్నతాధికారుల సమక్షంలో సమన్వయ సమావేశాలు పలుమార్లు నిర్వహించిన, పలు దపాలుగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలు అవలంబిస్తుందని వాపోయారు. సిపిఎస్ నుంచి ఓ పి ఎస్ కు ఉద్యోగులను తీసుకువచ్చేందుకు ఎన్ని పోరాటాలు చేసిన ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేస్తుందే తప్ప ఎన్నికల హామీ లో మాట ఇచ్చి ఉద్యోగుల ఓట్ల తో గెలిచిన ప్రభుత్వం ఆ హామీ నెరవేర్చడం లో పూర్తి గా విఫలం అయ్యింది అన్నారు. డిఎలు, పిఎఫ్, ఏపీ జి ఎల్ రుణాలు, తుది చెల్లింపులు డీఏ, పీఆర్సీ బకాయిలను పెండింగ్లో పెట్టి ఉద్యోగులను మోసం చేస్తోందని అన్నారు. ప్రజలకు పలు సంక్షేమ పథకాలకు విరివిగా నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ఉద్యోగులు ప్రజలలో భాగమేనని తెలుసుకోవాలని హితవుపలికారు. ప్రతీ నెలా జీతం ఆలస్యం అవుతుంది అని, జీతం డబ్బులు తో బతికే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని, ఈ నెల నేటికీ జీతం రాకపోవటం దారుణం అన్నారు. ఎన్నికల విధులు నుంచి ఉపాధ్యాయులు తప్పించ మని కోరటం తోనే వారిని తప్పించాం అని విద్యాశాఖ మంత్రి అనటం హాస్యాస్పదం అని, మేము కోరింది పాఠశాలల బాత్ రూమ్ ఫోటోలు, విద్యార్థులు హాజరు, తదితర పనులు నుంచి వెసులుబాటు కల్పించాలి అని మాత్రమే కోరాం అన్నారు. రాష్ట్ర అభివృద్ధి లో ఉద్యోగుల పాత్ర కీలకం అని ప్రభుత్వం గుర్తెరిగి, ఉద్యోగుల న్యాయ మైన డిమాండ్ లను నే రవేర్చాలి అని కోరారు. సమస్యలను సకాలంలో పరిష్కారం చూపనిపక్షంలో పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి తేజ, బగానే రమణమూర్తి, గురుగుబెల్లి రమణ, చింతాడ సూర్యారావు, పేడాడ రామకృష్ణ, మన్యం అధ్యక్షుడు ఎస్ శ్రీనివాస్ పట్నాయక్, జి నరేష్, వెంకట్రావు, రామచంద్ర, బగానా రామారావు పెద్ద ఎత్తును ఉద్యోగులు తది తరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక లారీలు పట్టివేత

విశాలాంధ్ర-పొందూరు : పొందూరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ పరిధిలోని జి.సిగడాం మండలం సర్వేశ్వరపురం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను బుధవారం పట్టుకున్నట్లు సిఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామం వద్ద వాహనాల తనిఖీలు చేపడుతుండగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఈబి ఎస్ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

నౌపడలో అక్రమ మట్టి తవ్వకాలు... ఉపాధి బిల్లు అయిన చెరువు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం నౌపడ మేజర్ పంచాయతీలో, అక్రమార్కులు చెరువులో మట్టిని వదలడం లేదు. నౌపడలోని సర్వేనెంబర్ 482లో ప్రభుత్వ భూమిలో ఉన్న దాకా బంధ చెరువు గట్టును కొందరు ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ పనిచేసి బిల్లు అయిన చెరువు మట్టి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఈ చెరువులో గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా లక్షలాది రూపాయలు వెచ్చించి గట్లు వేశారు. వేసిన గట్లు నామరూపాలు లేకుండా తవ్వేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే అది రైతులకు సంబంధించిన చెరువని, వారి అభిప్రాయం మేరకే మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఎదురు దాడి చేస్తున్నారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్ పలుమార్లు హెచ్చరించినా, అదేమీ పట్టనట్టు తవ్వకాలు సాగిస్తున్నారని ఆయన వాపోయారు. దీనిపై తహశీల్దార్ కె. చలమయ్య మాట్లాడుతూ పరిశీలించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక పీఆర్వో ప్రసాద్ చెరువుని పరిశీలించి ఫిర్యాదు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భవన కార్మికుల సంక్షేమ పథకాల సాధనకు ఉద్యమ కార్యాచరణ

- రాజమండ్రిలో జరిగిన 7వ జాతీయ మహాసభల్లో పిలుపు
- 1996 సంక్షేమ చట్టం పటిష్టంగా అమలుచేయాలి
- నిర్మాణ వ్యయం 2శాతం సెస్ వసూలు చేయాలి
- బోర్డులో సభ్యత్వం చేర్పించాలి... యూనిఫారం అందించాలి
- సహజ మరణంకు రూ.5 లక్షలు, ప్రమాద మరణంకు రూ. 10లక్షలు అందించాలి
- రాష్ట్రంలో పెండింగ్ ఉన్న 32 వేల క్లైమ్స్ వెంటనే పరిష్కరించాలి
- ప్రభుత్వం దారిమళ్ళించిన వేల కోట్లను బోడు అకౌంటులో డిపాజిట్ చేయాలి
- ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి అనపాన డిమాండ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా నిలిపివేసిన పథకాల అమలు, హక్కుల సాధన కోసం జాతీయ స్థాయిలో ఉద్యమ కార్యాచరణ చేపట్టనున్నట్లు రాజమండ్రిలో నవంబరు 26 నుండి మూడు రోజులపాటు జరిగిన జాతీయ మహాసభలు తీర్మానం చేసినట్లు ఏ.పి.భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర సహాయ కార్యదర్శి అనపాన షణ్ముఖరావు అన్నారు. బుధవారం శ్రీకాకుళంలో గల రామలక్ష్మణ జంక్షన్‌వద్ద గల కామ్రేడ్ ఎస్.ఆర్.దాసరి క్రాంతి భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర భవన నిర్మాణ సంక్షేమ చట్టం 1996ను పటిష్టంగా అమలుచేసి, సుప్రీంకోర్టు రిట్ పిటిషన్ 318/2006 ద్వారా 2009లో ఇచ్చిన తీర్పు ప్రకారం రెండు శాతం సెస్ వసూలుచేసి సంక్షేమ బోర్డులో డిపాజిట్ చేసి కార్మికుల సంక్షేమానికి పలు పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డులో ప్రతీ నిర్మాణ కార్మికులకు సభ్యత్వం చేర్పించాలని కోరారు. సంక్షేమ బోర్డు ద్వారా అమలుచేస్తున్న పథకాలకు పెట్టుకున్న 34వేల పెండింగ్ క్లైమ్స్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. యూనిఫాం, పనిముట్లు ఉచితంగా అందించాలన్నారు. సహజ మరణం పొందిన కార్మిక కుటుంబాలకు రూ.5లక్షలు, ప్రమాద మరణం పొందిన కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షలు, ప్రసూతి ఆర్థిక సహాయం 6 నెలలు కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినిమం పెన్షన్ రూ.6000లు 50 యేళ్ళు నిండిన మహిళా కార్మికులకు, 55 యేళ్ళు నిండిన కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందించాలని కోరారు. నిర్మాణ రంగంలో పనిచేసిన కార్మికులకు ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్., హౌసింగ్ స్కీమ్స్ బోర్డు ద్వారా అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాలు దారిమళ్ళించిన వేల కోట్లు రూపాయిలను బోర్డులో డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు రిట్ పిటిషన్ నెం.318/2006లో 2009, 2011, 2014, 2018లలో ఇచ్చిన తీర్పు ప్రకారం బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికి తప్పా మరే ఇతర అవసరాలకు వాడకూడదని ఇచ్చిన ఆదేశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రభుత్వ పథకాలతోపాటు బోర్డు ద్వారా కూడా పథకాలందించి కార్మికులు హుందాగా బ్రతకడానికి చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు, హక్కుల సాధన సంవత్సరంగా 2023ను ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ముఖ్య సలహాదారు చిక్కాల గోవిందరావు, పంచిరెడ్డి అప్పారావు, డి.హెచ్.పి.ఎస్. నాయకులు బలగ రామారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ సూర్యనారాయణ, చుక్క వెంకటరావు, నిర్మాణ రంగ కార్మికులు కారిగ్గి కృష్ణ, గురయ్య, ముడిదాన భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట సేవరత్నపురస్కారం

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఇంటర్నేషనల్ వాలంటరీ డే సందర్భంగా ఆదరణ వెల్ఫేర్ సొసైటీ విశాఖపట్నం వారిచే 2022వ సంవత్సరానికి ,స్వచ్ఛంద సేవలను గుర్తించి, విశిష్ట సేవారత్న పురస్కారం, పాస్టర్, టొంపల రమణమూర్తి (జార్జి ముల్లర్)కి ఈ పురస్కారాన్ని ఇవ్వడానికి ఎంపిక చేశారు. అవార్డుకి ఎంపికైన కారణంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ,డాక్టర్ జాన్ వెస్లీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్లు , ప్రతినిధులు, సంఘసంస్కర్తలు, పలువురి సమక్షంలో, ఈ కార్యక్రమం ఘనంగా జరిగిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అవార్డు ప్రధానం చేసిన, ఆదరణ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్, జి.చెన్నకేశవులు వారి బృందానికి తనను గుర్తించి ఈ అవార్డు ప్రధానం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు పాస్టర్ టొంపల రమణమూర్తి, (జార్జి ముల్లర్) తెలియజేశారు.

హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలి

మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బోయిన నాగేశ్వరరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : కళింగ కోమటి సామాజిక వర్గంలో ఎంతో పేరు ప్రతిష్ఠ కలిగిన గార మండలపరిషత్ ఉపాధ్యాక్షుడు బరాటం రామశేషును హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని స్థానిక మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు బోయిన నాగేశ్వరరావు అన్నారు. ఆయన బుధవారం స్థానిక విలేకర్లుతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నేత బరాటం రామశేషును దారుణంగా హతమార్చడం చూస్తే రాజకీయంగా ఎదుగుదలను చూడలేక కొందరు ప్రత్యర్థులు ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టిన తీరు హేయమైన చర్యేనని, దీనిని నేను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. రామశేషు హత్య చేసిన ఘటన కళింగ కోమటి సామాజిక వర్గంలో తీవ్రవిషాదం నింపిందన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి హత్య చేసిన వారు ఎంతటి వారైన శిక్షపడేలా చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బోయిన క్రిష్ణారావు, తదితరులు ఉన్నారు.

చెత్త సంపద కేంద్రం పనులు నిలుపుదలకు దళిత సంఘాలు నిరసన

విశాలాంధ్ర-పొందూరు : మండలం దళ్ళవలసలో మాదిగ వీధి ప్రక్కన నిర్మాణంలో ఉన్న చెత్తసంపదకేంద్రం పనులు నిలిపివేయాలని బుధవారం దళితసంఘాలు నిరసన వ్యక్తం చేసాయి. దళ్ళవలస గ్రామంలో గత కొంత కాలంగా మాదిగవీధి సమీపంలో నిర్మిస్తున్న చెత్త సంపదకేంద్రం నిర్మాణాన్ని మాదిగసామాజికవర్గం వ్యతిరేకిస్తోంది. పలు దఫాలుగా స్పందనలో కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. నిర్మాణం పూర్తయితే చెత్త వస్తే దుర్గంధంతో మాదిగవీధివాసులు ఇబ్బంది పడాల్సివస్తుందని అనారోగ్యంబారిన పడతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుల నిర్మూలనా సమితి అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బెలమర ప్రభాకర్, ఎస్వీ జగన్నాథం ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. జనవాసాలకు కనీసం కిలోమీటరు దూరంలో చెత్త సంపదకేంద్రం నిర్మాణం చేపట్టాలని నిబంధన ఉందని ఈ మేరకు జనావాస సమీపంలో నిర్మిస్తున్న నిర్మాణాన్ని నిలుపుదల చేయకపోతే ప్రత్యక్షచర్యలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు రాకోతి రాంబాబు, ఎస్. గురుమూర్తి, మాదిగ వీధివాసులు పాల్గొన్నారు.

కంచమ్మ తల్లి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-కంచిలి: గ్రామదేవత శ్రీ కంచమ్మ తల్లి దేవాలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం కమిటీ సభ్యులు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్దిల ఆనందరావు ఆధ్వర్యంలో సభ్యులు హుండీ లెక్కింపు చేపట్టారు. 14,900 రూపాయలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు పాపారావు, సెక్రటరీ ఉమాపతి, ఆలయ పూజారి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు కరెంట్ సప్లయ్

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలోని లింగాలవలస జగనన్న లేఅవుట్లో సామూహిక గృహాలకు తక్షణమే విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నట్లు ఎఇ కనస్ట్రక్షన్ డోల విజయదుర్గ ఎఇ వారణాశి వెంకటేశ్వరరావు తెలిపారు. డిసెంబర్ 21 తేదీకి సిద్ధంగా ఉన్న ప్రతి ఇంటికి ఎలక్ట్రికల్ కనెక్షన్ ఇవ్వమని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకున్న వారికి పాతపద్ధతి ప్రకారం ఎలక్ట్రికల్ కనెక్షన్ ఇవ్వమని చెప్పారు. లేఅవుట్లో ఉన్న ఇళ్లకు మాత్రం ఒక్క రూపాయి కూడా చెల్లించలకుండా సర్వీసు కనెక్షన్ ఇమ్మని ఆదేశించడం జరిగిందన్నారు. ఇల్లు పూర్తయిన ప్రతి ఇంటి యజమాని ఆధార్‌కార్డు, ఎలాట్మెంట్ లెటరు, కొత్త సర్వీసు కొరకు ధరఖాస్తు, సెల్ఫ్ డిక్లరేషన్ ఫారంతో పాటు ఒక తీసుకుని దగ్గరలో ఉన్న ఎనర్జీ అని స్టెంట్కి ఇవ్వవలెను. ఎలక్ట్రికల్ ఆఫీసులోనే రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఉచితంగా కాంట్రాక్టర్ మీటరు బోర్డు, సర్వీసు వైర్లు, డిపార్ట్మెంట్ స్టాండర్స్‌తో బిగించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ పాగోటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పంచాయితీ నిధులతో చెరువుల రక్షణ

విశాలాంధ్ర-పొందూరు : పొందూరు మేజర్ పంచాయతీ పరిధిలో ఉండేటాటువంటి పలు మంచినీటి చెరువుల నుండి ప్రజలను రక్షించే విధంగా పనులు చేపట్టేందుకు పంచాయితీ నిధులు వెచ్చించి చెరువుల నుండి రక్షణ కల్పించే విధంగా పనులు చేపడతామని మేజర్ పంచాయితీ సర్పంచ్ రేగిడి లక్ష్మితెలిపారు. పంచాయితీ తీర్మానానికి కొంతమంది వార్డు సభ్యులు హాజరు అయ్యారు. ఫోరం పూర్తి అవ్వడంతోసమావేశం నిర్వహించామని ఏవో జనార్ధన్ రావు తెలిపారు.

కుత్తుమలో ఇదేమి ఖర్మ కార్యక్రమం

విశాలాంధ్ర-కంచిలి : కుత్తుమ గ్రామంలో బుధవారం టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంచిలి మండల తెలుగుదేశం నాయకులు కామేష్ రెడ్డి, బంగారు కురయ్య, మద్దిల ఆనందరావు, బొద్ద హరిబాబు తదితరులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ మూడున్నర ఏళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రజా వ్యతిరేక పాలన గురించి తెలియజేశారు. ఒక అవకాశం అంటూ పరిపాలనకు వచ్చి ఇదేం ఖర్మరా బాబు అనే స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమరాల శోభన్, జగదీష్ పట్నాయక్, సర్పంచ్ ప్రతినిధి సనపల కామేశ్వరరావు, మద్దిల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-సోంపేట : జాతీయ ఆహారభద్రత మిషన్ రబీ కాలానికి వేరుశనగ విత్తనాలు రాయితీ 30 కేజీలకు రూ.1030లు సర్పంచ్ ఉగ్రపల్లి కృష్ణారావుతో కలిసి సోంపేట వ్యవసాయ సంచాలకులు కె.జగన్మోహనరావు తాళభద్రలో రైతులకు పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, వ్యవసాయ సహాయకులు సిహెచ్ సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామం నుంచి 100 మంది వేతనదారులకి పని కల్పించాలి :ఎంపీడీవో

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతిరోజు 100 మంది వేతనందారులకు తక్కువ లేకుండా ఉపాధి కల్పించాలని క్షేత్ర సహాయకులకు, ఉపాధి హామీ సిబ్బందికి ఎంపీడీవో పి.సూర్యనారాయణ రెడ్డి సూచించారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు మంజూరై నిర్మాణాలు చేపట్టే ప్రతి లబ్ధిదారులక 90 రోజులు వేతనం లబ్ధిదారుల ఖాతాలో వెంటనే జమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఉపాధి హామీ వేతన్దారులకు ఎన్.ఎం ఎం యాప్లో క్షేత్ర సహాయకులు రోజుకు రెండుసార్లు ఉదయం పని మొదలైన నాలుగు గంటలకి మధ్యాహ్నం పని మొదలైన నాలుగు గంటలకు తరువాత వేతనదారులకు హాజరు యాప్లో నమోదు చేయాలని, హాజరు పంపనియెడల వేతనందారుని బిల్లుపడదని తెలిపారు. ప్రతి వేతనంధారిని బిల్లులు పెండింగ్ లేకుండా సకాలంలో చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఈసీ సీలంబరు, టిఏలు బల్లెడ శ్యాంసుందర్, ముద్దపు దివ్య, క్షేత్ర సహాయకులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు తక్షణమే ప్రారంభించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్ : వాతావరణం కలిసి రావడంతో ఖరీఫ్ వరి చేలు కోతలు పూర్తి చేసుకుని పొలాల్లో బడిపెలు వేసుకొని నూర్పులుచేసి ధాన్యం అమ్ముకొందామని రైతులు ఎదురుచూస్తున్నారని తక్షణమే ప్రభుత్వ మద్దత ధర రైతులకు అందేలా కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి బడిత అప్పలనాయుడు కోరారు. స్థానిక ఎస్ ఆర్ దాసరి క్రాంతి భవన్ లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బుడితి మాట్లాడుతూ ఆర్భాటపు ప్రకటనలు తప్ప ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు నేటికీ ఎక్కడ ప్రారంభించలేదన్నారు. మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ డిపాజిట్లు సకాలంలో చేయకుండా కాలయాపన చేసి రైతులను ఒత్తిడి గురి చేయటం మిల్లర్ల ఎత్తుగడని, అధికారులు గుర్తించి వారిపై ఒత్తిడి చేయాలని, ఆ ప్రక్రియ ప్రారంభించక పోతే సమయం గడుస్తున్న కొలది రైతులలో ఆందోళన పెరుగుతుందన్నారు. పండగ దగ్గర పడుతున్న కొలది రైతులు ఒత్తిడికి గురై గ్రామంలో దళారులు, రైస్ మిల్లర్ల దోపిడికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ధాన్యం కొనుగోలు ప్రారంభించి రైతు దోపిడీకి గురికాకుండా చూడాలని ప్రభుత్వ అధికారులను కోరారు. లేకుంటే రైతుల పక్షాన ఉద్యమ చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వాపర వెంకటరమణ, చిక్కాల గోవిందరావు ఉన్నారు.

చెన్నై విద్యార్థులకు రాంబుడ్డి మనో వికాస శిక్షణ

విశాలాంధ్ర-సోంపేట : తమిళనాడు రాష్ట్రం చెన్నైలో త్యాగరాయనగర్‌లో గల ఆంధ్రకేశరి పాఠశాలలో తెలుగు విద్యార్థులకు ఈ మండలం కొర్లాంకు చెందిన జాగృతి సంస్థ అధినేత రాంబుడ్డి గణపతి బుధవారం మనోవికాస తరగతుల్లో భాగంగా ఉత్తమ జీవితంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థి దశ నుంచి మంచి గుణాలను అలవాటు చేసుకుని ఉన్నత భవిష్యత్తుకు మార్గం సుగమం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసం, సమయపాలన, నైతిక విలువలు, కఠోరమైన సాధన, స్వీయ క్రమశిక్షణకు అలవాటు పడాలని అన్నారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఎల్లవేళల గౌరవిస్తూ తమ జీవితాలను ఉన్నతంగా మల్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గురుబెల్లి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రహ్మణుల సమస్యలపై పోరాడుతా..!

-రాష్ట్ర నాయీబ్రహ్మణ సవిత సమాజం ఉపాధ్యక్షుడు భాస్కరరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : నాయీ బ్రహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు పై ప్రభుత్వంతో పోరాడుతానని రాష్ట్ర నాయీబ్రహ్మణ సవిత సమాజం ఉపాధ్యక్షుడు పట్నాన భాస్కరరావు అన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన సమావేశంలో ఈ పదవిని భాస్కరరావుకు నియమించబడిన నేపథ్యంలో బుధవారం కోటబొమ్మాళి మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయీబ్రహ్మణ సంఘం సభ్యులు కోటబొమ్మాళి ఓప్రవేటు హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నాయీబ్రహ్మణుల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేసిందని, ప్రస్తుత ప్రభుత్వానికి నాయీబ్రహ్మణులు ఎక్కడ ఉన్నారో తెలియటంలేదని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మనమంతా కలిసికట్టుగా పనిచేసి టీడీపీ విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడుల నాయకత్వం లో పనిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బొమ్మాళి కృష్ణారావు, రామదాసు, తెలగవలస శంకరరావు, కె.హరికృష్ణ, సిహెచ్.శివ, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి : డాక్టర్ లాడి అలీష

విశాలాంధ్ర-ఆమదాలవలస : ప్రతి బుధవారం భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపీ డాక్టర్ లాడి అలీషా తెలిపారు. బుధవారం మండలం లోని భవిత కేంద్రం నందు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిజియోథెరపీ సేవలను 18 సంవత్సరములు లోపల ఉన్న బడి ఈడు దివ్యాంగుల పిల్లలు ఉపయోగించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి దుప్పల రామారావు కోరారు. ఫిజియో %ఱతీ%. లాడి అలీష మాట్లాడుతూ తల్లితండ్రులు క్రమం తప్పకుండా ఇంటివద్ద వ్యాయామం చేయాలని కోరారు. క్రమం తప్పకుండా చేసే వ్యాయామం ద్వారా చిన్నారుల్లో శక్తి పెరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమం లో సహిత ఉపాధ్యాయులు పూజారి శ్రీధర్,ఎస్.గోవిందరావు. ఎం ఐ ఎస్ రమణ, సి ఆర్‌పిలు శ్రీనివాసరావు,ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఏపీజేఎఫ్ వినతి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ఇతోధికంగా నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరమ్ విజ్ఞప్తి చేశారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డిని ఏపీజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు బుధవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ మేరకు వినతి పత్రం అంద జేశారు. ముందుగా సీఎస్‌కు ఏపీజేఎఫ్ తరఫున జోగినాయుడు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్య లను సీఎస్‌కు వివరించారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులతోపాటు బస్సు, రైల్వే ల్లో ప్రయాణించే సమయంలో రాయితీ కల్పించాలని, అర్హులైన జర్నలిస్టులకు సొసైటీలతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల తరహాలో 50 సంవత్సరాలు దాటిన సీనియర్ జర్నలిస్టులకు నెలకు రూ.3వేలు పింఛను ఇప్పించాలని, ప్రెస్ అకాడమి తరఫున ఏటా ప్రతి డివిజన్ కేంద్రంలో శిక్షణ తరగతులు నిర్వహించాలని, వాటిని కనీసం వారం రోజులకు తగ్గకుండా శిక్షణ ఇవ్వాలని, ప్రెస్ అకాడమీకి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, అకాడమీ లో సభ్యులను నియమించాలని జోగి నాయుడు విజ్ఞప్తి చేశారు.

రక్తదానం చేసి మహిళ ప్రాణాలు కాపాడిన యువకుడు

విశాలాంధ్ర-కవిటి: సోంపేట ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళకు కళింగపట్నం గ్రామానికి చెందిన సురేష్ అనే యువకుడు రక్తదానం చేసి మహిళ ప్రాణాలు కాపాడాడు. తన వాట్సాప్ గ్రూప్ ద్వారా విషయాన్ని తెలుసుకున్న సురేష్ సోంపేట ప్రైవేట్ ఆసుపత్రికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకుని తక్షణమే స్పందించి 12వసారి రక్తదానం చేసి ఓ మహిళకు ప్రాణాపాయ స్థితి నుండి కాపాడాడు. ఈ కార్యక్రమంలో కళింగపట్నం గ్రామ వాలంటీర్ విశ్వాస్ పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుపి సి కేంద్రాలు పూర్తిగా వినియోగంలోకి తేవాలి

విశాలాంధ్ర-కవిటి: అన్ని గ్రామ పంచాయతీలలో ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలు పూర్తిగా వినియోగంలోనికి తెచ్చి పంచాయతీలకు ఆదాయ వనరులకు బాటలు వేయాలని ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రమైన కవిటి ఎంపీడీవో కార్యాలయంలో ఈ ఓ పి ఆర్ డి శివాజీ పాణిగ్రాహి తో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీపిడిపి శిక్షణా తరగతులు, ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రాలు పనితీరు,గ్రీన్ అంబాసిడర్లు వేతనాలు, ఇంటి పన్నులు వసూల్లు, ఆన్లైన్ రిపోర్ట్ ల వివరాలు, తదితర అంశాలపై చర్చించారు. సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీజామృతం తయారీపై అవగాహన

విశాలాంధ్ర-కంచిలి: మండలంలోని గోకర్ణపురం పంచాయతీ జే నారాయణపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ డివిజనల్ యాంకర్ యశోద ఆధ్వర్యంలో రైతులకు బీజామృతం తయారీ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40 లీటర్ల నీరు, 10 కిలోల పేడ, 10 లీటర్ల ఆవు మూత్రంతో ఈ బీజామృతంను ఎలా తయారు చేసుకోవచ్చో తెలియజేశారు. ఈ బీజామృతాన్ని విత్తన శుద్ధికి ఉపయోగిస్తే మొలకశాతం పెరగడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ సి ఆర్ పి చిట్టిబాబు, ఐటి రేవతి, రైతులు పాల్గొన్నారు.

వర్సిటీలన్నిటికీ ఒకటే అకాడమిక్ క్యాలెండర్ : వీసీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల పరిధిలో ఒకటే అకాడమిక్ క్యాలెండర్ అమలు చేసేలా ఉన్నత విద్యా మండలి షెడ్యూల్ విడుదల చేసిందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. వర్సిటీలో ఆయన బుధవారం మాట్లాడుతూ ఈ విధానం వల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అన్ని వర్సిటీలు డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఏకకాలంలో పరీక్షలు నిర్వహణ ఫలితాల ప్రకటన జరుగుతుందన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఐదవ సెమిస్టర్ లో నాలుగు నెలల పాటు ఇంటర్న షిప్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఇంటర్నెట్ షిప్ ఈనెల ఏడు నుంచి మార్చి నెల వరకు జరుగుతుందని చెప్పారు. ఆరవ సెమిస్టర్ లో విద్యార్థులకు తరగతుల నిర్వహించి థియరి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. డిగ్రీ ఐదవ సెమిస్టర్ లో 10,389 మంది విద్యార్థులు వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఇంటర్న షిప్ కు హాజరవుతారని చెప్పారు. విజయనగరం, మన్యం, పార్వతీపురం జిల్లాలో అదనంగా 1500 మంది విద్యార్థులు ఆయా జిల్లాలలో ఇంటర్న షిప్ లో పాల్గొంటారని తెలిపారు. అలాగే వెయ్యి మంది విద్యార్థులు ఆన్లైన్లో ఇంటర్ షిప్ లో పాల్గొంటారని తెలిపారు.

చిలకపాలెం టోల్ ప్లాజా ఎత్తివేత

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని చిలకపాలెం జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజాను బుధవారం అర్ధరాత్రి నుంచి ఎత్తివేస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పిడి శివశంకర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కేంద్ర ఉ పరితల రవాణా శాఖ మంత్రి లోక్సభలో 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న టోల్ ప్లాజా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో చిలకపాలెం టోల్ ప్లాజా ను ఎత్తివేస్తున్నారు. జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా చిలకపాలెంలో 2007లో టోల్ ప్లాజా ను ఏర్పాటు చేశారు. ఈ టోల్ ప్లాజా ద్వారా రోజుకు సుమారు 22 లక్షల రూపాయల వరకు వసూలు అవుతుంది. టోల్ ప్లాజా ను ఎత్తివేస్తున్నప్పటికీ ఈ ఆర్థిక భారాన్ని మడపం, నాతవలస టోల్ ప్లాజాలపై వేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ టోల్ ప్లాజాలో పనిచేస్తున్న 107 సిబ్బందిని మడపం, నాతవలస టోల్ ప్లాజాల వద్ద సర్దుబాటు చేస్తారని తెలుస్తోంది.

ట్రిపుల్ ఐటీలో పూర్తిస్థాయిలో ప్రయోగశాలలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో పూర్తిస్థాయిలో ప్రయోగశాలలో అందుబాటులోకి తెస్తున్నట్లు అకడమిక్ డీన్ మోహనకృష్ణ చౌదరి తెలిపారు. ఈ క్యాంపస్లో 60 ల్యాప్టాప్లతో కొత్తగా కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశామన్నారు. ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 90 లక్షల రూపాయలతో ల్యాబ్లు ఏర్పాటుకు టెండర్లు ఖరారయ్యాయని తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకి 3.5 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచామన్నారు. అలాగే పియుసి - 1 విద్యార్థులకు లాప్టాప్ లు పంపిణీకి టెండర్లు పిలిచినట్లు తెలిపారు.

బిఆర్‌ఏయు ఇన్‌ఛార్జి రిజిస్టర్‌గా ప్రొఫెసర్ అడ్డయ్య

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఇన్చార్జ్ రిజిస్టర్ గా ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య నియమితులయ్యారు. వర్సిటీ అకాడమిక్ డీన్ గా ఉన్న ప్రొఫెసర్ అడ్డయ్య ఈనెల 8 నుంచి 27వ తేదీ వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి హెచ్ ఎ రాజేంద్రప్రసాద్ విదేశీ పర్యటన నిమిత్తం సెలవు పై వెళుతుండగా ఇన్చార్జి రెస్టార్ గా ప్రొఫెసర్ అడ్డయ్య వ్యవహరిస్తారు. ఇంజనీరింగ్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ గా సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఉదయ్ భాస్కర్ వ్యవహరిస్తారు.

అంత వర్సిటీ పోటీలకు హాకీ క్రీడాకారులు ఎంపిక నేడు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : సౌత్ జోన్ అంతర్వర్సిటీ పోటీలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ తరఫున పాల్గొనేందుకు హాకీ పురుష క్రీడాకారులు ఎంపిక ఈ నెల 8న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతుందని వర్సిటీ స్పోర్ట్స్ డీన్ ప్రొఫెసర్ పీలా సుజాత తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు సంబంధిత కళాశాలలో చదువుతున్నట్లు ధృవీకరణ పత్రంతోపాటు పదో తరగతి, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో ఉదయం 10:30 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు బెంగుళూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోండి

విశాలాంధ్ర - నరసన్నపేట : 2019వ సంవత్సరం అక్టోబర్, 30వ తేదీ లోగా ఏదైనా డిగ్రీలో పట్టభద్రులైన వ్యక్తులు ఈనెల 9వ తేదీలోగా గ్రాడ్యుయేట్‌గా ఓటరు నమోదు చేసుకో వాలని ఎం.ఎల్.ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, లయన్.డా.ముద్దాడ బాలభూపాల నాయుడు కోరారు. బుధవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-18, డిగ్రీ ప్రొవిజనల్ పట్టా(అటెస్టెడ్), ఆధార్ కార్డ్, ఓటరు కార్డుతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో జత చేసి, ఆర్‌డివో, తహశీల్దార్ కార్యాలయాల్లో అందచేయా లని తెలిపారు. అలాగే డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు డాట్ సిఈఓఆంధ్రా డాట్ ఎన్‌ఐసి డాట్ ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని అన్నారు.

ప్రభుత్వంపై జనాగ్రహం ఉంది

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్ : జగన్మోహనరెడ్డి ప్రభుత్వంపై జనాగ్రహంతో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. 44 వ డివిజన్ టీడీపీ ఇన్చార్జ్ కవ్వాడి సుశీల ఆధ్వర్యంలో "ఇదేం ఖర్మ" కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ చెత్తపై పన్ను వేస్తూ సామాన్య ప్రజలను ఆర్థికంగా ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. ఆ చెత్తను కూడా నగరంలో సరిగా తొలగించడం లేదని పేర్కొన్నారు. టీడీపీకి అనుకూలంగా ఉన్నారంటూ అర్హులైనవారికి సంక్షేమ పథకాలను నిలిపివేశారని ఆరోపించారు. వైకాపా మూడున్నరేళ్ల పాలనలో తీసుకున్న ప్రతి జనాగ్రహ నిర్ణయాలపై అన్ని వర్గాల ప్రజానీకం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ మాట్లాడుతూ నగరంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉందని అయినా పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, వాటిని నివారించే కనీస ప్రయత్నం ప్రభుత్వం చేయకపోవడం దురదృష్ట కరమన్నారు. యువతకు విద్య, ఉపాధి లేకుండా కార్మికులకు ఇసుక లేకుండా ఉపాధి కోల్పోయారన్నారు. ఇప్పటికే ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి పతనం ఖాయమని, తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం ప్రజలు కల్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు పీఎంజే బాబు, టీఎన్టీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోళా శ్రీనివాస్, రాష్ట్ర టీసీ సెల్ ఉపాధ్యక్షులు జిల్లా శ్రీనివాస రావు, ముస్లిం మైనార్టీ నియోజక వర్గ అధ్యక్షులు షాను, తెలుగు యువత ఉపాధ్యక్షులు సిరిపురం హరి, డివిజన్ ఇన్చార్జిలు గండేపల్లి భవాని, కరగాన రాము, భాస్కర రావు, సురకాశి వెంకటరావు పాలి శెట్టి మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో స్పీకర్ తమ్మినేని మాటకు విలువలేదు : కూనా విమర్శ

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : జయహో బీసీ మహాసభ కార్యక్రమంపై మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పందిస్తూ మూడున్నరఏళ్లలో బీసీలకు గోచీ మిగిల్చిన వైసీపీకి జయహో బీసీ అనడానికి సిగ్గనిపించడంలేదా? బీసీలకు ద్రోహం చేసింది వై.యస్ కుటుంబమే, పూటకో మాట మాట్లాడే తమ్మినేని సీతారాంని చూసి ఊసరవెల్లి సైతం సిగ్గు పడుతోంది అన్నారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే సీతారాంను చూసి ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుంది. జగన్‌రెడ్డి బీసీలను ఉద్ధరించినట్లు సీతారాం మాట్లాడు తున్నారు. గతంలో టీడీపీలో వున్న సీతారాం వైఎస్ బీసీలకు చేసింది ఏంలేదు" అన్న సీతారాం నేడు పార్టీ మారగానే మర్చిపోయారా..? రాజకీయాల్లో పార్టీలు మారినా వ్యక్తిత్వం మారకూడదు. కానీ ఇలా పూటకో మాట మాట్లాడే వ్యక్తి మన స్పీకర్‌గా ఉండడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం. బీసీలకు మోసం, ద్రోహం, దగ, అన్యాయం చేసింది వైఎస్ కుటుంబమే. రాజారెడ్డి నుంచి నేటి జగన్‌రెడ్డి వరకు బీసీల శవాల మీద రాజకీయ పునాదులు ఏర్పాటు చేసుకున్నారు. జగన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా అణగతొక్కుతున్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లలో కోత కోసి 16,800 మందిని స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులు కాకుండా అడ్డుకున్నది ఎవరు? 8,000 ఎకరాల బీసీల భూములను బలవంతంగా లాక్కుంది ఎవరు? 50 మంది ముఖ్యమంత్రి సలహాదారుల్లో బీసీలెంత మంది? 34వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి ద్రోహం చేసింది జగన్‌రెడ్డి కాదా? 26 మంది బీసీలను పొట్టన పెట్టుకున్న మీకు బీసీల గురించి మాట్లాడే అర్హత ఉందా? 56 కార్పోరేషన్లను ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప వాటికి కనీసం రూ. 56 అయినా ఖర్చు చేశారా? చంద్రబాబు టీటీడీ ఛైర్మన్ పదవిని బీసీకి ఇస్తే.. జగన్ రెడ్డి మాత్రం తన సొంత బాబాయికి కట్టబెట్టాడు. మీ దృష్టిలో సామాజిక న్యాయం అంటే ఇదేనా..? రాష్ట్రంలో వైసీపీ నేతల మాటలను బీసీలు నమ్మే పరిస్థితి లేదు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇకనైనా వైసీపీ నేతలు రంకెలు వేయడం మాని చర్చకు వస్తే బీసీలకు ఎవరేం చేసారో అంకెలతో సహా వివరించడానికి సిద్ధంగా ఉన్నాం అన్నారు.

ఆర్గానిక్ స్టోర్ ప్రారంభం

- క్రిమి సంహారక మందుల వినియోగాన్ని తగ్గించాలి
- సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలి
- ప్రారంభోత్సవంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలోని రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకాన్ని క్రమంగా తగ్గించి, సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పేర్కొన్నారు. నగరంలో గల రైతుబజార్ ప్రాంగణంలో న్యూ ఆర్గానిక్ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం వలన ప్రమాదంలో పడ్డామని అందరూ తెలుసు కునే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ ప్రమాదం నుంచి బయట పడాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో మొదలైందని కలెక్టర్ తెలిపారు. ఈ పరిస్థితిని ఒకేసారి తగ్గించడం కష్టమని, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకాన్ని క్రమంగా తగ్గించి, సేంద్రియ వ్యవసాయం వైపుకు రైతులను మళ్ళించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఒకప్పటిలా పశువులు, ఆవు పేడలతో తయారు చేసిన సేంద్రియ ఎరువుల వాడకంపై రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. మంచి వ్యవసాయ పద్ధతులను విధిగా పాటించాలో తెలుసుకోవా లన్నారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుని దుశ్శాలువతో ఘనంగా కలెక్టర్ సత్కరించారు. మరింత మందికి మీరు ఆదర్శంగా నిలచి సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపేల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముకళ్ళ తాతబాబు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు కైలాస రావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సౌజన్యంతో విద్యార్థులకు రక్త పరీక్షలు

విశాలాంధ్ర-పొందూరు: మండలం కింతల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు బుధవారం రెడ్ క్రాస్ వారి సౌజన్యంతో రక్త పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 370 మంది విద్యార్థినీ విద్యార్థులు రక్త నమూనాలను అందించారు. విద్యార్థులు అందరికీ గ్రూపు నిర్ధరణ చేశారు. సిబ్బందితోపాటు జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సునీత, ఎన్‌సిసి పిఓ ఎస్వి రమణతోపాటు కళాశాల నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ గూడెంలో విద్యుతీకరణ పనులు

విశాలాంధ్ర-పొందూరు: మండలం వీఆర్ గూడెంలో పంచాయితీ సర్పంచ్ నిధులతో గ్రామాల్లో విద్యుతీ కరణ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పలు వీధుల్లో విద్యుత్ స్తంభాలు శిథిల స్థితికు రావడం, విద్యుత్ దీపాలు అంతరాయం కలగటం కారణంగా ప్రజలుపడుతున్న ఇబ్బందులు దృష్ట్యా సర్పంచ్ ప్రతినిధి సువార మధు, ఉప సర్పంచ్ గోవిందరావులు కొత్త స్తంభాలను అమర్చి దగ్గరుండి పనులు చేపడుతున్నారు.

బీసీ గర్జనలో సంతబొమ్మాళి నాయకులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలానికి చెందిన పలువురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయవాడలో జరిగిన బిసి గర్జన సభలో పాల్గొన్నారు. ఈ సభలో సంతబొమ్మాళి మండలం పిఎసిఎస్ ఛైర్మన్ కిల్లి జగన్నాయకులు (గోవిందరావు) పాలతలగాం పంచాయితీ సర్పంచ్ ప్రతినిధి,యువ నాయకులు, నక్కిల్ల నరేష్, ఎంపీటీసీ అట్టాడ అరుణ అప్పలనాయుడు, నౌపడా సర్పంచ్ పిలక బృందావతి రవి కుమార్ రెడ్డి, వైకాపా నాయకులు సర్పంచ్ ప్రతినిధి కోత సతీష్ కుమార్, మేఘవరం ఎంపీటీసీ సూరాడ రాజారావు, మేఘవరం సర్పంచ్ సునీత శ్రీనివాసరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మి పలస పంచాయితీ సర్పంచ్ శ్రీరంగం వీరాస్వామి, ఎంపీటీసీ చింతల రాజులు, మలగాం పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి సూరాడ వెంకటేష్, జిల్లా వైకాపా నాయకులు మోడీ భాస్కర రెడ్డి, కొల్లిపాడు పంచాయితీ సర్పంచ్ నవరయ్య,ఎంపీటీసీ కొండయ్య, ఎస్ బి కొత్తూరు సర్పంచ్ లోకనాదం తో పాటు, మండలంనుంచి పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మాకన్నపురం రైతు భరోసా కేంద్రం తనిఖీ చేసిన ఆర్‌డీఓ

విశాలాంధ్ర-సోంపేట : మండలం బుషాభద్రలో ఉన్న మాకన్నపురం రైతు భరోసా కేంద్రాన్ని తహశీల్దార్, వ్యవసాయాధికారితో కలిసి ఆర్‌డిఓ టి.సీతారామ్మూర్తి ధాన్యం కొనుగోలుకేంద్రాలు పరిశీలనలో భాగంగా సందర్శించారు. తేమ 17 శాతం, ఇతర నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం కేంద్రానికి సమాచారం ఇచ్చిన వెంటనే కొనుగోలు చేపడతామని, రైతులు ఆందోళనతో దళారులను ఆశ్రయించవద్దని, అలాగే నేరుగా మిల్లుకు వెళ్లవల్సిన అవసరంలేదని తెలిపారు. కొనుగోలు కేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రెవెన్యూ పరిశీలకులు కిరణ్, గ్రామ రెవెన్యూ అధికారి జగన్, వ్యవసాయ సహాయకులు భార్గవి, ఆర్ట్స్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రియాంక పాల్గొన్నారు.

పలాస నియోజకవర్గంలో రాజకీయ వేడి

పోటాపోటీగా నాయకుల పర్యటనలు

విశాలాంధ్ర-పలాస: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో అప్పుడే పలాస అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయాలు వేడెక్కుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సచివాలయం వారిగా నిర్వహిస్తుండగా గతంలో టీడీపీ బాధుడే బాధుడు కార్యక్రమం గ్రామాల్లో నిర్వహించి ప్రస్తుతం ఇదేమి ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలకు చేరువుతున్నాయి. నియోజకవర్గ గ్రామాల్లో రెండు పార్టీల్లో రాజకీయ కదలికలు ప్రారంభమయ్యాయి.

అయితే రెండు పార్టీల్లోను ఇక్కడి నాయకత్వాలకు వ్యతిరేక కూటములు ఏర్పడ్డాయి. అధికార వైసీపీ పార్టీలో రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు వ్యతిరేకంగా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ వైసీపీ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దువ్వాడ హేమబాబు చౌదరి, అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర నాయకులు జుత్తు నీలకంఠం నాయకత్వాన ప్రాంతాలు వారిగా సమావేశాలు నిర్వహిస్తూ వారి ఉనికిని చాటుతుండగా దీనిని మంత్రి అప్పలరాజు పట్టించుకోకుండా ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు గడప గడప కార్యక్రమాన్ని ఉధృతం చేస్తున్నారు. డాక్టర్ సీదిరికి టిక్కెట్ ఇస్తే వైసీపీ పరాజయం తప్పదంటూ అసమ్మతివర్గం బాహాటంగా ప్రకటిస్తున్నా అవేమీ పట్టనట్లు మంత్రి డాక్టర్ సీదిరి వ్యవహరిస్తూ తన పని తాను చేసుకుంటూ పోతున్నారు. అయితే అసమ్మతి తమకు ఏమీ చేయలేదని, తాటాకు చప్పుళ్లకు బెదిరే పరిస్థితి లేదని మంత్రి సీదిరి అప్పలరాజు వర్గం అంటున్నారు. ఇదిలా ఉండగా మంత్రి డాక్టర్ సీదిరికి టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషా రూపంలో మరో అవకాశం రావచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గౌతు శిరీషా టీడీపీ అభ్యర్థి అయితే మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గతంలో కన్నా రెట్టింపు మెజార్టీతో గెలుస్తారని ధీమాతో ఉన్నారు. ఇక టీడీపీని పరిశీలిస్తే వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, వైసీపీ గ్రూపు రాజకీయాల వల్ల పార్టీ అభ్యర్థి గౌతు శిరీషా గెలుపు సునాయసమవుతుందని టీడీపీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి.

అయితే గౌతు శిరీషాకు టిక్కెట్ ఇస్తే ఓడిపోతామని, కొత్తవారిని టీడీపీ అధిష్టానం టిక్కెట్ ఇస్తే డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పోటీ రసవత్తరంగా ఉంటుందని, మరి కొంతమంది టీడీపీ ద్వితీయ శ్రేణులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో టీడీపీ, వైసీపీ నాయకులు నియోజకవర్గంపై తమ పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. మరికొంత కాలానికి ఈ పరిస్థితి మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతమే ఎన్నికల వాతావరణం పలాస నియోజకవర్గంలో కనిపిస్తుంది. ఇదిలా ఉండగా అగ్నికుల క్షత్రియ కులానికి చెందిన ఉన్నతాధికారి జుత్తు తాతారావు తెలుగుదేశం పార్టీ టిక్కెట్ ఆశిస్తూ ఈ ప్రాంతంలో సుడిగాలి పర్యటనలు చేస్తూ ఉద్దాన ప్రజలను కలుసుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు పావులు కదుపుతున్నారు. కేవలం కులం కార్డుతో టిక్కెట్ సంపాధించి అసెంబ్లీకి పోటీ చేసేందుకు ఉవిళ్లూరుతున్నారు. ఉద్దాన ప్రాంతంలో తనకే టిక్కెట్ వస్తుందని చెబుతూ కుల సంఘాల నాయకులను కలుస్తున్నారు. ఈయన అభ్యర్థిత్వాన్ని టీడీపీ అధిష్టాన వర్గం పరిశీలనలోకి తీసుకుంటుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది.